కాత్యాయని.. వర ప్రదాయిని



గాజుల అలంకరణలో శుభానంద దేవి

కాళేశ్వరం, భూపాలపల్లి న్యూస్‌టుడే: కాళేశ్వర క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుభానంద, సరస్వతీదేవీలు కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భూపాల పల్లిలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణ అవతారంలో దర్శనమిచ్చారు.




పూలమాలల అలంకరణలో సరస్వతీ దేవి



కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణగా

గురుతర బాధ్యత మీదే..!



జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్‌జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు

ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..


ఈనాడు, మహబూబాబాద్-న్యూస్‌టుడే, భూపాలపల్లి



హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..


ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

సరికొత్తగా.. పారిశ్రామిక శిక్షణ!

న్యూస్‌టుడే, భూపాలపల్లి



భూపాలపల్లి ఐటీఐ కళాశాల ఆవరణలో మొదలైన ఏటీసీ నిర్మాణ పనులు

ప్రస్తుత ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ఇప్పటికే సివిల్ పనులు మొదలయ్యాయి. వారం క్రితమే భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో పనులు ప్రారంభించారు. వచ్చే నవంబరు వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐ కళాశాలల గురించి పట్టించుకోకపోవడంతో కొత్త కోర్సులు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ల అప్‌గ్రేడ్లను గాలికొదిలేశారు. అరకొర వసతులతో ఐటీఐలు నిర్వీర్యమై విద్యార్థులు కూడా నైపుణ్యాభివృద్ధికి దూరమయ్యారు. కనీస మరమ్మతుల్లేక శిథిల భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసి, నిరుద్యోగ యువతకు నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. ఐటీఐ కళాశాల ఆవరణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లను నిర్మిస్తుండగా, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పనులు ఇప్పటికే ప్రారంభించారు. భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఏటీసీ నిర్మాణ పనులకు దాదాపు రూ.4.50 కోట్ల నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఆరు కొత్త ట్రేడ్‌లలో ప్రవేశాలు

యువతలో నైపుణ్యాల అభివృద్ధి చేసి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు ఏటీసీలలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే కోర్సులు మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, రెండు సంవత్సరాల కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ మెకానికల్, అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ మెషనింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ అనే ట్రేడ్ ఏర్పాటు చేయనున్నారు. ఒక ఏడాది కాలపరిమిత గల ట్రేడ్‌లలో 24 చొప్పున సీట్లు, రెండేళ్ల కాలపరిమిత గల ట్రేడ్‌లలో 40 సీట్ల చొప్పున అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే ఐటీఐ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. కొత్త కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు 8 వరకు ఉన్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో రెండు చొప్పున, హనుమకొండ జిల్లాలో 3, మహబూబాబాద్ జిల్లాలో ఒకటి.. మొత్తం 8 ప్రభుత్వ ఐటీఐ కళాశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 ఐటీఐ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ నిర్మాణ పనులకు అనుమతిచ్చింది. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2024-25 సంవత్సరంలో ప్రభుత్వం కేవలం భూపాలపల్లి, ఏటూరునాగారం ప్రభుత్వ ఐటీఐలలో మాత్రమే ఆరు కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతిచ్చింది.

యువతకు ఎంతో ప్రయోజనకరం

- జుమ్లానాయక్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, భూపాలపల్లి



ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏటీసీలతో నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఇటీవల భవన నిర్మాణ పనులు ప్రారంభించాం. ఆరు కొత్త ట్రేడ్‌లపై సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అడ్మిషన్ల ప్రక్రియ చేపడతాం.



బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ



బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే



ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

ప్రకృతిని ప్రేమించే పండగ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక బతుకమ్మ అని పూలను దేవతగా పూజించి ప్రకృతిని ప్రేమించే పండగ బతుకమ్మ అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బతుకమ్మ పండగను ప్రతి ఒక్కరు సంతోషంతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల మహిళా ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

5,053 మందికి బోనస్ చెల్లింపు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ అందిస్తున్న బోనస్‌ను మంగళవారం భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న 5,053 మంది కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వీరికి మొత్తం రూ.97,28,77,521 వరకు జమ చేసినట్లు స్థానిక సింగరేణి అధికార వర్గాలు తెలిపాయి. భూపాలపల్లి ఏరియాలో మొత్తం 5,380 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో గడిచిన ఏడాదిలో వంద మస్టర్లు పూర్తి చేసుకోని వారు 327 ఉన్నారు. వీరికి లాభాల బోనస్ వర్తించదని తెలిపారు. ఈ మేరకు రూ.2 లక్షలకు పైగా లాభాల వాటా పొందిన ఉద్యోగులు భూపాలపల్లి డివిజన్‌లో 2,411 మంది ఉన్నారు. రూ.2 లక్షల లోపు తీసుకున్న వారు 2,642 మంది ఉన్నారు. ఈ ఏరియాలో 2,900 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున బోనస్‌ను సింగరేణి యాజమాన్యం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. వీరికి రూ.1.45 కోట్ల వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు హైదరాబాద్‌కు డీఎస్సీ అభ్యర్థులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: డీఎస్సీ ప్రక్రియ కసరత్తు పూర్తయింది. మంగళవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కలిసి అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. డీఎస్సీ- 2024లో ప్రకటించిన పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా మంచి ర్యాంకులు సాధించిన వారి వివరాలు పరిశీలించారు. రిజర్వేషన్ల వారీగా ఉన్న పోస్టుల్లో 95 శాతం స్థానికత, 5 శాతం ఓపెన్‌టు ఆల్ అనే నిబంధన ఆధారంగా కసరత్తు చేశారు. మొత్తం జిల్లాలో 212 పోస్టులకు అభ్యర్థులను ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందించనున్నారు. జిల్లా నుంచి ఎంపికైన వారిని హైదరాబాద్‌కు తరలించడానికి 5 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకే హైదరాబాద్ చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో రాజేందర్ తెలిపారు. ఎంపికైన వారు ఉదయం 6 గంటలకు భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని ఇప్పటికే అభ్యర్థులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో సద్దుల బతుకమ్మ, దసర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తెలిపారు. జయశంకర్ విగ్రహం దగ్గర నుంచి గణేష్ చౌక్ ప్రాంతంలోని హన్‌మాన్ టెంపుల్ వరకు జాతీయ రహదారి మధ్యలో రంగు రంగుల విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు పాలక సభ్యుల అనుమతితో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు రూ.24 లక్షల నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. మొత్తం 30 వార్డుల్లో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా మహిళలు ఆటలు ఆడుకునేందుకు వివిధ కాలనీల్లో భూమి చదును పనులు చేపట్టారు. విద్యుత్తు దీపాలు అమర్చుతున్నారు. బతుకమ్మల నిమజ్జనం కోసం పట్టణంలోని పాత ఎర్ర చెరువు ప్రాంతంలో, జంగేడు, కాశీంపల్లి, పుల్లూరిరామయ్యపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాట్లు చివరి దశకు చేరాయి. దసరా పండగ సందర్భంగా స్థానిక సింగరేణి క్రీడా మైదానంలో రావణాసుర వధ ఏర్పాట్లను మంగళవారం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈసారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.



హనుమాన్ టెంపుల్ సమీపంలో ..

అడవిపై గొడ్డలి వేటు



ఆజంనగర్- కేశవాపూర్ అడవుల్లో నరికివేత

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి: అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఓ వైపు ప్రభుత్వాలు పాటుబడుతుంటే అక్రమార్కులు పోడు పేరుతో వాటిని నరికివేస్తున్నారు. చెట్లను నరికి ఆ భూములను ఆక్రమించుకుంటున్నారు. తాజాగా ఆజంనగర్ రేంజి పరిధిలో పోడు జరిగినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. చెట్లను నరికివేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

భూపాలపల్లి మండలం ఆజంనగర్ నుంచి మహాముత్తారం మండలం కేశవాపూర్ వెళ్లే మార్గం పరిధిలోని బండల రేవు ప్రాంతంలో భారీగా చెట్లను నరికివేశారు. అడవులను నరకడమే లక్ష్యంగా కొన్ని ముఠాలు ఏర్పడ్డాయి. వారి కనుసన్నల్లోనే అడవులను నరికివేస్తున్నారు. చెట్లు నరికి చదును చేసిన భూములను అమ్ముకుని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కేసులు పెట్టినా యథేచ్ఛగా ఈ దందా సాగుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతాల్లో దట్టమైన అడవులు ఉండేవి. అడవులు ఖాళీ అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడే భారీగా పోడు..

మహాముత్తారం, భూపాలపల్లి మండలాల్లోనే ఎక్కువగా పోడు జరుగుతోంది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జిల్లాలోని భూపాలపల్లి, మహదేవపూర్ డివిజన్లలో 286.06 హెక్టార్ల ఆక్రమణ జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 328 మందిపై 148 కేసులు నమోదు చేశారు. ఇందులో ఒక్క ఆజంనగర్ రేంజి పరిధిలో 146 మందిపై 83 కేసులు నమోదయ్యాయి. మొత్తం 9 రేంజిలుండగా కేవలం ఆజంనగర్ పరిధిలోనే సగానికంటే ఎక్కువ కేసులు నమోదవడం గమనార్హం. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి అక్రమార్కులతో జత కట్టడంతో భారీగా పోడు జరిగినట్లు తెలిసింది. అధికారులు మాత్రం ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు. కేసులు నమోదు చేస్తున్నా పోడు ఆగడం లేదు. కేసులు నమోదైతే ఆ భూములకు తమకే నంటూ అపోహ పడుతున్నారు. మరోవైపు అటవీశాఖలో సిబ్బంది కూడా తక్కువగా ఉండటంతో పోడుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇన్‌ఛార్జులు, డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా అడవుల నరికివేతను అరికట్టాలి. పోడుకు ముఖ్య కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోడు నివారణకు కృషి చేస్తున్నాం:

వసంత, డీఎఫ్‌ఓ, భూపాలపల్లి


పోడు నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే తగ్గింది. పోడు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. బాధ్యులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆ భూములు కూడా స్వాధీనం చేసుకుంటున్నాం. ఆజంనగర్ ప్రాంతంలోనూ ప్రత్యేక నిఘా పెట్టి పోడును అరికడుతున్నాం. పోడు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అవగాహన కల్పిస్తున్నాం..

వీడియో కాల్ చేస్తారు.. కొల్లగొడతారు!

సైబర్ నేరగాళ్ల కొత్త పంథా

- కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం



'హలో మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం'.. అంటూ వీడియో కాల్ వస్తుంది. అందులో సీబీఐ కార్యాలయం, బోర్డులు కనిపిస్తాయి. మాట్లాడేవారు ఖాకీ దుస్తుల్లో ఉంటారు.. మీ అబ్బాయిని అరెస్టు చేశామనో, లేదా మీరు హవాలా మార్గంలో పెట్టుబడి పెట్టినందుకు కేసు నమోదు చేసి.. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మొదట బెదిరిస్తారు. ఆ తర్వాత కేసు నుంచి బయటపడాలంటే అడిగినంత ఇవ్వాలంటూ రూ.లక్షల్లో డిమాండు చేస్తారు. ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో అనేక మందికి ఇలా వీడియో కాల్స్ వచ్చాయి. సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలా అనేక రకాల పేర్లతో సామాన్యులకు వీడియోకాల్ చేసి బెదిరిస్తూ రూ.వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నారు.

కొత్త దారులు వెతుకుతూ..

సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా లింక్‌లు పంపించి, మల్టీలెవల్ మార్కెటింగ్, ఓటీపీ సంఖ్యలు తెలుసుకొని లేదా డెబిట్, క్రెడిట్ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నాడని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని. లేదంటే అరెస్టు తప్పదనేసరికి తల్లిదండ్రులు ఆందోళన చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంక్‌లు, వివిధ సంస్థలు, మాల్స్ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళలతో కొన్ని నెంబర్లకు ఫోన్ చేయించి వివరాలు తెలుసుకొని కొద్దిరోజుల తర్వాత సైబర్ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు.. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్, వీడియో కాల్స్ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి పేర్లతో కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్ కార్డు నంబర్లు చెప్పవద్దు.. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

మన దగ్గర అనేక ఘటనలు

- గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి అస్తులున్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.
- మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన పారిశ్రామిక వేత్తకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.
- హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియోకాల్ వచ్చింది. ఆమె ఫోన్ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నామని, మీ అబ్బాయిని మరో నలుగురితో కలిసి అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగుతిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్ ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్ కాల్ అని పెట్టేశారు.
- పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైందని, దిల్లీలోని కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని వాట్సాప్‌కు కొన్ని పత్రాలను పంపించారు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్‌లో వీడియో కాల్ కేసులు : 41

మొత్తం సైబర్ కేసులు 748

ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్ కేసులు 1215

మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్ 1930



సైబర్ నేరాలపై వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కొత్త పార్శిల్, కొరియర్ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకుని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్ వద్ద టీజీఐ అధికారులు తనిఖీ చేశారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా కార్గో ద్వారా బుకింగ్ అయిన వస్తువులని చెప్పారు. వాటికి సంబంధించిన రశీదు చూపించాలని కోరగా మూటలను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారి విధులు అప్పగించకుండా విచారణ జరిపించాల్సిన డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకులు రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెపుతున్నారు. కార్గో బుకింగ్ చేయని ఎలాంటి వస్తువులు, పార్శిల్ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లకు ఛార్జిషీట్ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్ జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్ అథ్లెటిక్స్, 2026లో ఏషియన్ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్ రికార్డు నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు సన్వి



వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హనుమకొండ నయింనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్‌ఆర్వో శంకర్, సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224



ప్రత్యేక డిస్కౌంట్లు.. ఆకట్టుకుంటున్న వాహనాలు

గిర్మాజీపేట : ఓరుగల్లు నగరంలో వాహనాల మార్కెట్ జోరందుకుంది. దసరా దీపావళి పండగల నేపథ్యంలో భారీ డిస్కౌంట్లతో వివిధ ఆటోమొబైల్ కంపెనీలు వాహన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. లక్కీ డ్రాతో బంపర్ ఆఫర్లను ప్రకటించాయి. ఎంపికచేసిన మోడల్స్‌పై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నారు. ఫైనాన్స్ సౌకర్యంతో పాటు, హెల్మెట్, ఐదు లీటర్ల పెట్రోల్, మొబైల్, గ్యాడ్జెట్స్‌ను కంపెనీలు ఉచితంగా అందిస్తున్నాయి. హోండా యాక్సెసరీస్‌పై ఏడాది వారంటీ ఇస్తున్నారు. ప్రతి వాహనం కొనుగోలుపై స్క్రాచ్ కార్డు, లక్కీడ్రా కూపన్ల ద్వారా కచ్చితమైన బహుమతులు పొందొచ్చు. లక్కీడ్రా విజేతలు సుజుకీ గిక్సర్ 250, యాపిల్ ఐఫోన్లు, హోం థియేటర్లు, బంపర్‌ప్రైజ్ కింద మారుతీ సుజుకీ కారును గెలుచుకునే అవకాశం ఉంది. ప్రతి బైక్ కొనుగోలుపై ఎల్ఈడీ స్మార్ట్ టీవీ ఉచితంగా పొందొచ్చు. పండగల వేళ వాహన కొనుగోలుదారుల ఇళ్లలో సంబరాలు నిండేలా బహుమతులు అందుకోవచ్చు. ఆధునిక ఫీచర్లతో కార్లు, యువత మనసును దోచేలా బైకులు, మోపెడ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రెడీమేడ్ వస్త్రాలు లేటెస్ట్ వెరైటీ డిజైన్లు, సరికొత్త స్టాకుతో ఆకట్టుకుంటున్నాయి.

ఆర్థికాభివృద్ధికే మహిళా శక్తి క్యాంటీన్

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధికే మహిళాశక్తి క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారికి రుణ సదుపాయాలు అందించి ఆదాయాభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరో పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా పోషకాలు కలిగిన, నాణ్యత ఉండే ఆహార పదార్థాలను అందించాలన్నారు. అనంతరం క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో అవినాశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్, పక్కన జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ

ఇంటింటికీ సురక్షిత నీరు అందించాలి

గణపురం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని బాధ్యతగా అందించాలని జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన గణపురం మండలం గాంధీనగర్‌లోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. నీటి సరఫరా, నీటి పరీక్షల నిర్వహణ, నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ఇక్కడి నుంచి నిత్యం 30 ఎంఎల్‌డీ నీటిని గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లో 196 ఆవాసాలకు శుద్ధిచేసిన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గొల్లబుద్ధారం మంచినీటి శుద్ధి కేంద్రం నుంచి ప్రతి రోజు 9 ఎంఎల్‌డీ నీటిని మల్హర్, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ఆవాసాలకు, కోనంపేట నీటి శుద్ధి కేంద్రం నుంచి మల్హర్, భూపాలపల్లి మండలాల్లోని 23 ఆవాసాలకు సురక్షిత తాగు నీరు సరఫరా జరుగుతున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్ శాఖలు చేపడుతున్న రహదారుల నిర్మాణ సమయంలో మంచినీటి పైపులు దెబ్బతింటున్నాయని, పనులు చేపట్టే ముందు మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రహదారుల నిర్మాణాల ప్రతిపాదనల రూపకల్పనలో మిషన్ భగీరథ వ్యయాన్ని కూడా చేర్చాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ మాణిక్యాలరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ నళిని, డీఈ సంధ్యారాణి, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లోని మిషన్ భగీరథ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోండి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికకు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నిక సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కలెక్టరేట్, ఆర్డీవో, కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఓటరు నమోదు ఫారాలు ఉచితంగా అందిస్తారని, పూరించిన దరఖాస్తులను నవంబరు 6వ తేదీ లోపు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు.

తేనె తుట్టె.. భయపెట్టే



స్థానిక కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని రెండో అంతస్తులో ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలో తేనె టీగల తుట్టెలున్నాయి. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వస్తున్న వారితోపాటు ఆ శాఖల ఉద్యోగులు వీటిని చూసి భయపడుతున్నారు. తుట్టెను ఎవరైనా కదిలిస్తే, తేనె టీగలు ఎంతమందిని గాయపరుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయం (ఎస్-14) ముందు భాగంలో, భూమి కొలతలు, రికార్డుల కార్యాలయం(ఎస్-20) వెనక భాగంలో రెండు తుట్టెలు ఉన్నాయి. వాటిని తొలగించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వండి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని సీపీఐ పట్టణ కమిటీ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రావి నారాయణరెడ్డి స్మారక భవన్‌లో మంగళవారం సీపీఐ పట్టణ కమిటీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గడిచిన ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, పట్టణ శివారు ప్రాంతంలో పేదలు వేసుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. బతుకమ్మ పండగ సందర్భంగా ప్రతి మహిళకు ఇస్తామన్న రూ.500 వెంటనే అందజేయాలన్నారు. భాస్కర్‌గడ్డ ప్రాంతంలో రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, రమేష్, అస్లాం, షాబీర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కాలువను కమ్మేసిన పిచ్చిమొక్కలు

మల్హర్, న్యూస్‌టుడే: మల్హర్ మండలం కాపురం చెరువు ప్రధాన కాలువను పిచ్చిమొక్కలు కమ్మేశాయి. ఏళ్ల తరబడి పూడిక తొలగింపులో నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయకట్టుకు సక్రమంగా నీరందని పరిస్థితి నెలకొంది. పంట చివరి దశలో నీటి తడుల కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాపురం చెరువు ప్రధాన కాలువ ఇలా..

బాబాయి అబ్బాయిలకు ఒకేసారి కొలువు

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తలుగు వరలక్ష్మి- వెంకటస్వామి పెద్ద కుమారుడు తలుగు ప్రవీణ్‌కుమార్ ఎస్జీటీగా ఎంపికయ్యాడు. వ్యవసాయ కూలీగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్ మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాడు. ఆయన బాబాయ్ సుధాకర్ తెలుగు బాషా పండితుడి ఉద్యోగం సాధించారు. ఈయన కూడా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇలా బాబాయి అబ్బాయిలు ఒకేసారి ఉపాధ్యాయ కొలువులు సాధించడంపై గ్రామస్థులు అభినందించారు.



సుధాకర్



ప్రవీణ్‌కుమార్

బతుకమ్మ ఆట స్థలం చదును

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్‌లో సద్దుల బతుకమ్మ ఆడే స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. 'ఈనాడు'లో మంగళవారం వచ్చిన బతుకమ్మ ఆట స్థలం ఎక్కడో.. అనే కథనానికి అధికారులు స్పందించారు. మహదేవపూర్ ప్రత్యేకాధికారి, డీఎల్పీవో వీరభద్రయ్య, పలువురు అధికారులు ఎర్ర చెరువు సమీపంలో స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేశారు. ప్రత్యేకాధికారి ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది చెత్తాచెదారం తొలిగించి, చదును చేశారు. సద్దుల బతుకమ్మ నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వేములపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పాండవుల నాగరాజు అత్యున్నత ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు రాజబోయిన భిక్షపతి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నాగరాజును అభినందించారు. ఈనెల 4 నుంచి 6 వరకు నిజామబాద్ జిల్లా కామారెడ్డిలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరపున పాల్గొన్నాడు. ఆట తీరులో అత్యంత ప్రతిభ కనబరిచి జట్టు తృతీయ బహుమతిని సాధించడంలో ప్రతిభ కనబరిచారన్నారు. నాగరాజుతో పాటు, శిక్షణలో తర్ఫీదునిచ్చిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుత్తికొండ సాంబయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



నాగరాజు

సీపీఎం మండల కార్యవర్గం ఎన్నిక

మహాముత్తారం, న్యూస్‌టుడే: మండలం సీపీఐ(ఎం) మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పోలంపల్లి గ్రామానికి చెందిన పోలం చిన్న రాజేందర్, సామాజిక మాధ్యమాల బాధ్యుడిగా గట్టు శంకర్, సభ్యులుగా మానేపటి బాబు, కుంజాం బుదిరాం, మడకం భద్రయ్య, రాదారపు మల్లయ్య, కోడి ఉగమ్మ, బొడ్డు సునీత, ఇప్పలపల్లి దేవేందర్, గొరగ పద్మ, మడవి మాడయ్య, కురుసం లక్ష్మయ్య సకినాల మల్లేష్, పోడియం శ్రీను, గడ్డం రమేష్ ఎన్నికైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు.



చిన్నరాజేందర్

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

రేగొండ, న్యూస్‌టుడే: తిర్మలగిరి శివారులోని బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో జాతరకు వచ్చే నాలుగు వైపుల నుంచి బీటీ రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.5.41 కోట్లతో చేపట్టనున్న పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జగ్గయ్యపేట, తిర్మలగిరి, నారాయణపురం ఎస్సీ కాలనీ వైపు నుంచి జాతరకు వచ్చే మార్గాలు రావులపల్లి నుంచి పాండవుల గుట్ట వరకు బీటీ రోడ్లను మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. బుగులోని గుట్టపైకి వెళ్లటానికి త్వరలోనే మరో రూ.2 లక్షలతో మెట్లను పునరుద్ధరణ చేయనున్నట్లు ప్రకటించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మంచి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్ కిష్టయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నేతలు సంపత్‌రావు, నర్సయ్య, సంతోష్, ప్రభాకర్, రాజేశ్వర్‌రావు, రాజయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

గుడుంబా పట్టివేత

మహాముత్తారం, న్యూస్‌టుడే: మండలంలో వేర్వేరు చోట్ల పోలీసులు గుడుంబా పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హెడ్‌కానిస్టేబుళ్లు మహేందర్‌రెడ్డి, రాజయ్యగౌడ్‌లు దాడి చేసి బోర్లగూడెంలోని ముకులోత్ పృథ్వీరాజ్ ఇంట్లో 20 లీటర్లు, యామన్‌పల్లిలోని హట్కర్ లక్ష్మీ ఇంట్లో 15 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. నిందితులిద్దరిపై ఎస్సై మహేందర్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పోలీసు కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా పోలీసు ఉద్యోగులు, వారి పిల్లలు, అధికారుల కుటుంబ సభ్యులు కలిసి సంతోషంగా ఆటపాటలతో సంబరాలు నిర్వహించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్ దంపతులు, డీఎస్పీలు, స్థానిక సీఐ నరేష్‌కుమార్ తదితర పోలీసు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు, అధికారులు

అన్నపూర్ణ అలంకారంలో దుర్గాదేవి

కాటారం, న్యూస్‌టుడే: దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు దుర్గాదేవి అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోషకాహారంతోనే ఆరోగ్యం

చిట్యాల, న్యూస్‌టుడే: చల్లగరిగె గ్రామంలోని ఒకటి, ఆరో అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రోత్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. పోషకాహార లోపం చిన్నారుల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన ఆహారం గురించి వివరించారు. బాలమృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, విజిత, కవిత, కనకలక్ష్మీ, శారద, తిరుపతమ్మ, కరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి బరువు తూస్తున్న సూపర్‌వైజర్ జయప్రద

బాలగోపాల్ వర్ధంతి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మానవ హక్కుల నేత స్వర్గీయ డాక్టర్ కె.బాలగోపాల్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలగోపాల్ ఎన్నో ఉద్యమాలు చేపట్టారని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు కె.సమ్మయ్య, కిరణ్, మల్లేష్, భిక్షపతి, సంజీవ్ శ్రీనివాస్, శ్రీధర్ చంద్రగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బాలగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రభుత్వ పాఠశాల కూల్చివేతపై ఫిర్యాదు

కాటారం, న్యూస్‌టుడే: చిదినెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా కూలగొట్టారని గ్రామస్థులు మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మను కలిసి ఫిర్యాదు చేశారు. ఐదు రోజుల క్రితం ఓ వ్యక్తి కొందరు గ్రామస్థులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా భవనం కూల్చివేసి, కలప, ఇతర విలువైన సామగ్రిని అమ్మినట్లు తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, సామగ్రిని స్వాధీనపరచుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో లింగయ్య, బాపు, రాములు, పృథ్వీ, రమేష్, రవి ఉన్నారు.

అన్నదానం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరంలోని అమ్మ భవానీ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాడుగల పవన్‌శర్మ ఆధ్వర్యంలో మండపం వద్ద అన్నదానం నిర్వహించగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి చిట్యాల ఠాణాలో సీఐ గన్‌మెన్ పులి అశోక్ చేయూతనందించారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. గన్‌మెన్‌ను స్థానికులు అభినందించారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

చిట్యాల, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ-టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో చిట్యాల మండల ఉపాధ్యాయులకు చోటు లభించినట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సాంబమూర్తి మంగళవారం తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గిరగాని కృష్ణ, సాంబారు రామ్‌నారాయణ, కుచినపల్లి శ్రీనివాస్, గోవింద సత్యనారాయణ, ఎండీ రహీంపాషా, బగనారపు రమేశ్, ఉపాధ్యక్షురాలిగా రావుల ఊర్మిళరెడ్డి, కార్యదర్శిగా మామిడి విజయసాగర్ నియమితులైనట్లు వివరించారు.

సంక్షిప్తంగా

చరవాణి అప్పగింత

చిట్యాల, న్యూస్‌టుడే: వ్యవసాయ పనులకు వెళ్లి వస్తూ మార్గం మధ్యలో పోగొట్టుకున్న చరవాణిని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు కనుగొని బాధితుడికి అప్పగించారు. చిట్యాల ఎస్సై-2 షాఖాన్ తెలిపిన ప్రకారం శనిగరపు మొగిలి వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా చరవాణి పోయినట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసిన పోలీసులు చరవాణిని కనుగొని మంగళవారం బాధితుడికి అప్పగించారు. చరవాణి కనుగొనడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు లాల్‌సింగ్, కోమల, మమతలను ఎస్సై-2 అభినందించారు.

మద్యం గొలుసు దుకాణాలతో పెరుగుతున్న నేరాలు

మహాముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి గ్రామంలో మద్యం గొలుసు దుకాణాలు ఉన్నా.. అబ్కారీ అధికారులు పట్టించుకోవడంలేదని భాజపా మహాముత్తారం మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. గ్రామాల్లో నిత్యం గొడవలు, నేరాలు పెరిగేందుకు ఈ దుకాణాలు కారణమౌతున్నాయని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఓ ప్రకటనలో ఆరోపించారు. గొలుసు దుకాణాల నిర్వాహకుల వద్ద మద్యం దుకాణా నిర్వాహకులు మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.



ప్రజా సేవకు పట్టం కట్టారు

చిట్యాల, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రజా సేవకు నేడు ప్రజలు పట్టం కట్టారని భాజపా మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. మంగళవారం వెలువడిన హరియాణా ఎన్నికల ఫలితాల్లో భాజపా అధికారంలోకి రావడంపై భాజపా శ్రేణులు ఇక్కడ బాణసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంచ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రవీందర్, సదానందం, శ్రీకాంత్, ప్రవీణ్, శ్రీనివాస్, ప్రభాకర్, దశరథం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో బాణసంచా పేలుస్తున్న భాజపా శ్రేణులు

బొగ్గుబాయి ముచ్చట్లు

సింగరేణి స్థాయి పోటీలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయి షటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన వీటిని జీఎం సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలకు సంస్థలోని 11 ఏరియాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కోల్‌ఇండియా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

నేడు కుటుంబ దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లో బుధవారం బతుకమ్మ వేడుకలు, కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు. కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సాయంత్రం 6గంటలకు నిర్వహించే ఈ వేడుకలో కార్మికులు, వారి కుటుంబసభ్యులు పాల్గొనాలని కోరారు. ఉత్తమ బతుకమ్మకు బహుమతులు ఇవ్వనున్నామని.. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మలతో రావాలన్నారు.

కొత్త గనులతోనే సింగరేణికి భవిష్యత్తు

గోదావరిఖని, న్యూస్‌టుడే: కొత్త గనులతో సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని ఏఐటీయూసీ నాయకులు రాజ్‌కుమార్ అన్నారు. వాటికోసం గుర్తింపు సంఘం పోరాటం చేస్తుందన్నారు. ఆర్జీ-1 సీఎస్పీ-1లో మంగళవారం ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న 15 ఏళ్లలో ప్రస్తుతం నడుస్తున్న గనులు మూసివేత దశకు చేరుకుంటాయన్నారు. వాటి స్థానంలో కొత్త గనులు ఏర్పాటు చేయకుంటే భవిష్యత్తు ఉండదన్నారు. నాయకులు పాల్గొన్నారు.

క్లబ్‌లో బతుకమ్మ వేడుకలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి అధికారుల క్లబ్‌లో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్జీ-1 సేవా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఎండీ సతీమణి శారద ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకల్లో పాటలు పాడారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అనిత, సభ్యులు ధనలక్ష్మిబాయి, మాదవి, లక్ష్మి, కళ్యాణి, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సంబరాలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల జీఎం కార్యాలయ ఆవరణలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వివిధ విభాగాల అధికారిణులు, ఉద్యోగినులు, కాంట్రాక్టు ఉద్యోగినులు ఉత్సాహంగా ఆడిపాడారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న సాయంత్రం 6 గంటలకు స్థానిక రుద్రమదేవి క్రీడా మైదానంలో ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు జీఎం సుధాకరరావు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, సీనియర్ ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తయిన నలుగురు డిపెండెంట్ల(కారుణ్య నియామకాల ద్వారా వచ్చిన వారసుల)కు మంగళవారం జీఎం వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందజేశారు. గుర్తింపు సంఘం నాయకుడు రామచంద్రారెడ్డి, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, డీపీఎం శ్రీహరి, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.